విజయవాడ వార్త

## కంచికచర్ల మండల ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి



కంచికచర్ల ఏప్రిల్ 17 ప్రభాతవార్త: కంచికచర్ల మండల ప్రజలు క్రికెట్ బెట్టింగ్, మరియు క్రికెట్ బెట్టింగ్ అప్స్ కు దూరంగా ఉండాలని క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్లకు తెలియజేయాలని, వేసవి కాలం దృష్ట్యా దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా ఆరు బయట నిద్రించే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నిర్మూలన కొరకు రహదారి భద్రత ప్రమాణాలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సైబర్ నేరాల పట్ల అవగాహనా పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని, నిషేదిత లాటరి టికెట్స్ కు ఎటువంటి అనుమతులు లేనందున వాటికి ప్రజలు దూరంగా ఉండాలని తదితర అంశాలపై అవగాహన కల్పించడం కొరకు మండలంలోని అన్ని గ్రామాలలో 3ఆటో లలో మైక్ అనౌన్స్ మెంట్ ద్వారా విజ్ఞప్తి చేయటం జరుగుతుందని కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ తెలియజేశారు.

## సెలవు రోజుల్లో కూడ పన్నులు చెల్లించవచ్చు

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : సెలవు రోజుల్లో కూడ క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని,ఇంటిపన్ను,ఖాళీస్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీతో 2026-27 సంవత్సరానికి చెల్లించిన వారికి 5 శాతం రాయితీని పండుగ రోజుల్లో కూడ ప్రజలు వినియోగించుకోవచ్చని కార్పొరేషన్ డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) జి.సృజన తెలిపారు.నగర పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు 286 సచివాలయాల్లో ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజలు పన్నులు చెల్లించవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఆన్‌లైన్లో వెబ్‌సైట్ డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.సిడిఎంఎ.జీవోవి.ఇన్ ద్వారా చెల్లింపులు చేయచ్చని,పురమిత్ర యాప్ ద్వారా కూడా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరన్నారు. ఈ అవకాశం కేవలం ఏప్రిల్ 30 వరకు మాత్రమే ఉన్నందున ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆమె కోరారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి పై పిడి యాక్ట్ అమలు

మచిలీపట్నం, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) : దొంగతనాలనే ప్రవృత్తిగా కలిగిన వ్యక్తిపై కృష్ణాజిల్లా పోలీసులు పిడి యాక్ట్ అమలు చేశారు. ప్రజా భద్రతకు భంగం కలిగించేలా ఏ ఒక్క వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసినా వారిపై చట్టంతో కొరడా ఝులిపిస్తామని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. పలు జిల్లాలలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 70 కు పైగా క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా నమోదైన మచిలీపట్నం, మేకవానిపాలెం, నవీన్ మిట్టల్ కాలనీకి చెందిన ఆరేపల్లి దుర్గారావు, దుర్గ (38)పై ప్రివెంటివ్ డిటెన్షన్ (పి.డి.) యాక్ట్‌ను అమలు చేశారు. గత కొంతకాలంగా వివిధ జిల్లాలలో దొంగతనాలు మరియు ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతూ ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్న ఈ నిందితుడిపై సమగ్ర విచారణ నిర్వహించగా, పలు కేసుల్లో అరెస్టయి, జైలు శిక్ష అనుభవించినప్పటికీ తన నేర ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, సమాజానికి ముప్పుగా మారిన ఈ వ్యక్తిని నియంత్రించేందుకు పి.డి. యాక్ట్ అమలు చేశామని ఎస్పీ తెలిపారు. ఇతనిపై 2017 నుండి డెకాయిట్ షీట్ కొనసాగుతుంది. నేర నివేదికను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కి పంపగా నిజనిర్ధారణ కావడంతో అతనిపై పిడి ఆక్ట్ ప్రయోగించేలా ఉత్తర్వులు జారీ చేయడంతో అతడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అలవాటుదారులపై భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, పోలీసులకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా బందరు ఇన్చార్జి డిఎస్పి శ్రీనివాసరావు, ఆర్ పేట ఇన్స్పెక్టర్ కె. యేసు బాబు, బందర్ తాలూకా ఎస్పై సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## బెట్టింగులకు పాల్పడే వారి పై ఉక్కుపాదం : సిపి రాజశేఖరబాబు



విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. సిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన గత మూడు సంవత్సరాల్లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ దొరికిన వారికి భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని కౌన్సిలింగ్ నిర్వహించారు. వారందరికీ మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారేమోనని డ్రగ్ మెడికల్ కిట్స్‌లతో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాలను సమూలంగా నిర్మూలించడానికి సైబర్ క్రైం డిసిపి కృష్ణ ప్రసన్న అధ్వర్యంలో ఒక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై హైటెక్ నిఘాను ఏర్పాటు చేసి, బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు,వెబ్‌సైట్‌లు,డార్క్ వెబ్ కార్యకలాపాలపై నిరంతరం పటిష్టమైన నిఘా ఉంచుతూ,ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రాం,టెలిగ్రాం వంటి సోషల్ మీడియా ఫ్లాట్‌ఫాంలలో బెట్టింగ్ ప్రచారాలను ట్రాక్ చేయడంతో పాటు ఎప్పటికప్పుడు సిబ్బందితో గ్రౌండ్ లెవెల్ సమాచారాన్ని సేకరించి,వాటిపై నిఘాను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కేవలం బెట్టింగ్ ఆడేవారిని మాత్రమే కాకుండా,ఈ వ్యవస్థను నడిపిస్తున్న మూలాలను కనిపెట్టి వాటిని పూర్తిగా నిర్మూలించడం దీని ప్రధాన ఉద్దేశ్యంగా చేసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. కేవలం ఆన్‌లైన్ మాత్రమే కాకుండా 'గేమింగ్ హౌస్'ల పేరుతో రహస్యంగా సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యంగా అనుమానితుల బ్యాంక్ ఖాతలను పరిశీలించి, సిడిఆర్,ఐపిడిఆర్ తదితర ఆధునాతన విశ్లేషణ ద్వారా నిందితులను గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం బ్లూటైగర్స్,డ్రగ్స్ నేరస్థులపై ప్రయోగించే పిడి యాక్ట్ పరిధిలోకి ఆన్‌లైన్,క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై కూడా తీసుకువచ్చే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

**నేరాల్లో పట్టుబడిన వారికి డ్రగ్ టెస్టులు**

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడేవారు,గొలుసు దొంగతనాలు,మోటారుసైకిలు చోరీలు,సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడే వారు,గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల వినియోగంతో సంబంధం కల్గి ఉంటారనే అనుమానంతో పట్టుబడిన వారందరికీ డ్రగ్స్ టెస్ట్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవ్‌టీజర్స్,మహిళలను వేధించే వారిని,రోడ్లపై,ఆటోల్లో లేదా వైన్ షాపుల పక్కన కూర్చుని మద్యం సేవించే వారికి కూడా డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహిస్తామన్నారు. ఒక్కసారి పాజిటివ్ వస్తే వారిని పదేపదే తనిఖీ చేస్తూ పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు.గురువారం ఒక మోటారుసైకిలు చోరీ కేసులో యువకుని టెస్ట్ నిర్వహించగా అతనికి పాజిటివ్ వచ్చిందని, విచారిస్తే జనవరిలో అతను గంజాయిని సేవించినట్లు తెలిపాడన్నారు. నాలుగు నెలల తర్వాత కూడా ఈ పరీక్షలో పాజిటివ్ వస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

**కమీషనరేట్ పరిధిలో నేరస్థులెవ్వరూ తప్పించుకోలేరు**

ఎన్టీఆర్ పోలీసు కమీషనరేట్ పరిధిలో హైవే కెమేరాలు,ఎఫ్‌ఆర్‌ఎస్ కెమేరాలు,ఎఎన్‌పిఆర్ కెమేరాలు,అత్యాధునిక సాంకేతికను వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ సాంకేతికత కారణంగా నేరస్థులు తప్పించేకునే అవకాశం లేదని,360 డిగ్రీల ఇన్వెస్టిగేషన్ జరుగుతుందన్నారు. ఫోన్‌కాల్స్,బ్యాంక్ లావాదేవీలు,డ్రగ్ నెట్‌వర్క్స్ లింక్‌లన్నీ బయటపడతాయన్నారు. ఎన్టీర్ కమీషనరేట్ పరిధిలో నేరం చేయాలంటే నేరస్థులు భయపడే విధంగా ప్రతి నేరస్థుడిని అన్ని విధాలుగా పరీక్షించి చట్టపరంగా శిక్షిస్తామన్నారు.

**త్వరలో డ్రగ్స్‌పై దండయాత్ర 3.0**

త్వరలో డ్రగ్స్‌పై దండయాత్ర 3.0 పేరుతో ప్రతి కళాశాల,స్కూలు విద్యార్థులకు డ్రగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలో కళాశాల,స్కూలు యాజమాన్యాలతో మీటింగ్ నిర్వహిస్తామని,ప్రతి కళాశాల,స్కూల్‌కు సర్‌ప్రైజ్ తనిఖీలను నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీలలో 100 శాతం విద్యార్థులకు నెగిటివ్ వస్తే ఆ కళాశాలకు డ్రగ్స్ ఫ్రీ సర్టిఫికెట్ ఇచ్చే విధంగా చర్యలు చేపడట్టడం జరుగుతుందని, లింగభేదం లేకుండా అందరికీ ఈ టెస్టులు చేస్తామన్నారు. ముఖ్యంగా యువత,విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఇప్పటి వరకు అలవాటు ఉన్నా సరే,ఇకైనా మానుకోవాలని,ఒకవేళ పట్టుబడితే పోలీసుల చర్యలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిసిపి కృష్ణకాంత్‌పటేల్,కెజివి రిత,కె.కృష్ణప్రసన్న,ఏసిపిలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలి : ఎమ్మెల్యే రాజగోపాల్

వత్సవాయి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండలం, వత్సవాయి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక అయిన ప్రజాదర్బారులో ఆయన స్వయంగా




ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఓపిగ్గా విని, సంబంధిత అధికారులకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలు సమర్పించిన అర్జీలలో ఇళ్ల నిర్మాణం, ఇళ్ల స్థలాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి అవకాశాలు, పెన్షన్లు, దివ్యాంగుల సర్టిఫికెట్లు, మున్సిపల్ సేవలు మరియు ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి బాధ్యతాయుతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధికారులు మరియు సిబ్బంది బాధ్యతతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలబెడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మరియు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాదర్బారు వేదికలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, చిట్టూరి రమేష్,చిట్టూరి సుభాష్, సాగర్ల కృష్ణవేణి, కనతాల రామకృష్ణ, ఉప్పుగండ్ల రాధాకృష్ణ, ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు, నర్మనేని శ్రీను, నెల్లూరి శ్రీను, చెన్న బాలకృష్ణ, కర్నాటి రఘు తదితరులు పాల్గొన్నారు.

## నేడు చీమలపాడు హైస్కూల్ వార్షికోత్సవం

### హెచ్‌ఎం రాజులపాటి హైమేశ్వరరావు

ఎ కొండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం చీమలపాడులో శనివారం జిల్లా పరిషత్ హైస్కూలు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం రాజులపాటి హైమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో స్పోర్ట్స్ గేమ్స్ ఇంకా ఇతర పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభా అవార్డులు, బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని హెచ్‌ఎం హైమేశ్వరరావు తెలిఆపరు. ఈ కార్యక్రమంలో డివైఈవో, ఎంఈవోలు గ్రామంలో పురప్రముఖులు డోనర్స్ పాల్గొంటారని హెచ్‌ఎం రాజులపాటి హైమేశ్వరరావు తెలిపారు.

## డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ లీకేజి సత్వర రిపేర్లు



ఎ కొండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలోని ట్యాంక్ బజార్‌లో డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌కు చెందిన మంచినీటి సరఫరా పైప్‌లైన్ లీకేజిని మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకుడు మోర్ల తిరుపతిరావు విజయవాడ ఎంపి కేశినేని చిన్ని సాకారంతో శుక్రవారం పారిశుధ్య కార్మికుల ద్వారా పైప్‌లైన్ వద్ద లీకేజి పూడికను తీయించి లీకేజిని 24 గంటలు కాకముందే రిపేర్లు చేయించి, ఈ ఎండాకాలంలో పైప్‌లైన్ ద్వారా కుళాయిలకు తాగునీరు సరఫరా జరిపించడంతో గ్రామ ప్రజలు ఎంపి చిన్ని సాకారం మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు, అభివృద్ధి అధికారి జిపిఎస్ బి.గోపి కృష్ణను అభినందించారు.

## దళారి చేతిలో మొక్కజొన్న రైతు చిత్తు..

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి క్వింటా రూ.2400లు ప్రకటించాలి

ఎ కొండూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో మొక్కజొన్న రైతులు దళారీల చేతిలో మోసపోయి చిత్తవుతున్నారని వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి దళారీల చేతిలో చిత్తు కాకుండా క్విటా ధర రూ.2400 మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత మొక్కజొన్న సాగు చేసిన రైతులు పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అయినకాడికి పంటను దళారీలకు అమ్ముకొని తీవ్రంగా మోసపోతున్నారు. రైతుల ధీనగాధను ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా కేంద్రం రాష్ట్రం స్పందించకపోవడంతో రైతులు దళారీల దోపిడికి గురవుతున్నారని అలాగే రైతుల వద్ద శనగలు కందులు పంట నిల్వల మొత్తాన్ని కొనుగోలు చేసి రైతులను దళారీల దోపిడి నుండి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు సంఘాలు ఒక సంయుక్త ప్రకటనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## నిర్మాణ వ్యర్థాలతో సంపద సృష్టించేందుకు సిఅండ్‌డి ప్లాంట్

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : నగరంలోని నిర్మాణ వ్యర్థాలతో సంపదను సృష్టించేందుకు సి ఎన్ టి ప్లాంట్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని,నగరపాలక సంస్థ పరిధిలో గల బిల్డర్లు అందరూ అజిత్‌సింగ్‌నగర్‌లో గల గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్లోని సి అండ్ డి ప్లాంట్‌కు నిర్మాణ వ్యర్థాలను పంపించాలని చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్ అన్నారు.నగరంలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడున్నా సరే వాటిని అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్ లోకి తరలించమని సిబ్బందికి ఆదేశించారు. అక్కడున్న సి ఎన్ డి ప్లాంట్స్ ఉపయోగించి నిర్మాణ వ్యర్థాలతో పాదచారుల కోసం వేసే పేవర్ బ్లాక్స్,సిమెంట్ ఇటుకలు తయారుచేసి నగరపాలక సంస్థ చేసే అభివృద్ధి పనుల్లో ఉపయోగిస్తున్నందున ప్రజలకు కావాలన్నా నగరపాలక సంస్థ వారి నుండి పొందవచ్చన్నారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రోన్‌లతో పర్యవేక్షిస్తూ నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా నిర్ధారించుకోవాలన్నారు. బిల్డర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్యల్లో భాగంగా పెనాల్టీ తప్పవన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం పై తల్లులకు, గర్భిణీ స్త్రీలులకు అవగాహన

వీరులపాడు ఏప్రిల్ 17 ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా నందిగామ వీరులపాడు మండలం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంపై తల్లులకు, గర్భిణీ స్త్రీలులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం అంగన్వాడి టీచర్ కుమారి మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కాయగూరలు, పాలు, పండ్లు, పప్పు, దినుసులు ఉండే



పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు పేదలు ఆరోగ్యం కోసం కోట్లాది. రూపాయలు ఖర్చు చేస్తుందని వాటిని పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు సద్వినియోగం పరుచుకోవాలని, పౌష్టికాహారంలోపం లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అయ్యా కొలకలూరి మరియమ్మ, ఆశా వర్కర్లు, తల్లులు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరులో జాతీయ రహదారి ఆక్రమణల తొలగింపుపై సమీక్ష సమావేశం

తిరువూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : తిరువూరు పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణల తొలగింపుపై ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు, జాతీయ రహదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించిన ఆక్రమణలను



నిబంధనల ప్రకారం తొలగించేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు.సంబంధిత కాంట్రాక్టర్లకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు, అలాగే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.రామచంద్రాపురం నుంచి తిరువూరు వరకు సుమారు 36 కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇందులో చీమలపాడు, కంభంపాడు గ్రామాలతో పాటు తిరువూరులో ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయని పేర్కొన్నారు. నోటీసుల ద్వారా ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. నియమ నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నుంచి తిరువూరు పట్టణంలో ఆక్రమణలు తొలగించే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తదుపరి ఆర్డీవోతో కలిసి విస్సన్నపేటలో పర్యటించి అక్కడ కూడా ఆక్రమణలు గుర్తిస్తామని పేర్కొన్నారు.

## హెచ్‌ఎండీ బ్రాండ్ అంబాసిడర్‌గా రాఘవ్ జుయల్

అమరావతి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : వెండితెరతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌పై తనదైన శైలి నటనతో, వినోదంతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ నటుడు రాఘవ్ జుయల్‌తో తమభాగస్వామ్యాన్ని ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ హెచ్‌ఎండీ అధికారికంగా ప్రకటించింది. జెన్‌జీ, మిలీనియల్ వంటి విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న రాఘవ్ పాన్‌ఇండియా స్టార్‌గా ఎదిగారు. త్వరలో మార్కెట్లోకి రాబోతున్న హెచ్‌ఎండీ సరికొత్త స్మార్ట్‌ఫోన్ సిరీస్‌కు రాఘవ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు.

## దోమల లార్వా ఉత్పన్నమవ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం : బయాలజిస్ట్ కామేశ్వరరావు

విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 17, ప్రభాతవార్త : డ్రోన్‌లతో ఎంఎల్ ఆయిల్‌ను స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవ్వకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ బయాలజిస్ట్ కామేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు .ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నాప్పటికీ ప్రతి ఇంటిలో దోమలు ఉత్పన్నమవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంటిలో దోమల



నియంత్రించేందుకు ప్రతి ఇంటిలో ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని కార్పొరేషన్ బయాలజిస్ట్ కామేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కోళ్ళఫారం రోడ్డు,భవానీపురంలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ఆ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుంద న్నారు. అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడా ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్‌తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నార న్నారు. నగర పరిధిలో ఫాగింగ్,స్ప్రేయింగ్,మరి కొన్ని చోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చేపలను విడుదల చేస్తూ నగరంలో దోమల సమస్యలు ఉండవన్నారు. ప్రతి శుక్రవారం ఇంటిలో,ఇంటి చుట్టు పరిసరాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని,ముఖ్యంగా తొట్లు,వాడుక లేని బకెట్లు,మగ్గులు, డ్రమ్ములు,పూల కుండీలు,ఏ వస్తువైనా వాడకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి,ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంటిలో దోమల సమస్య తగ్గుతుందన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్ళి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయో చూపించి,వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్‌తో పాటు శానిటరీ ఇనస్పెక్టర్లు, మలేరియా సిబ్బంది,ఎఎన్‌ఎంలు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## తెదేపా జాతీయ ఉపాధ్యక్షునిగా వైవిబి

కంకిపాడు ఏప్రిల్17,ప్రభాతవార్త : పార్టీపట్ల నిబద్ధతగల నాయకునికి పదవి రావడం ఆనందదాయకం అని తెలుగు మహిళలు,కార్మిక పరిషత్ నాయకులు దళిత సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా వైవిబి రాజేంద్రప్రసాద్‌ను నూతనంగా నియమించడంతో పూలమాలలతో వివిధ సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా శుక్రవారం వారి గృహంలో ఆయనను ఘనంగా



సత్కరించారు. వారు మాట్లాడుతూ 25సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా, 45సంవత్సరాలు ప్రజాసేవలో ఉంటూ ఉయ్యూరు ప్రజల మనిషిగా నేనున్నానంటూ భరోసా కల్పించే నాయకుడని హర్షం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పరిమి సలోమి,సంతోషి,కోరాడ వెంకటలక్ష్మి, తెనాలి పద్మావతి,తెలుగు మహిళలు మాదినేని జ్యోతి,అరుణ, ఆశాదేవి,ఉయ్యూరు డిపో కార్యదర్శి శోభనాద్రి,జిల్లా నాయకులు శ్రీనివాసరావు,కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యార్లగడ్డ రమేష్,రవి,మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు కిరణ్,టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా నిరుపయోగంగా ఉన్న

## గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్....

కంచికచర్ల ఏప్రిల్ 17 ప్రభాతవార్త: కంచికచర్ల మండల పరిధిలోని కంచికచర్ల ఇందిరా కాలనీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో



ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ ధనాన్ని కొన్ని లక్షల రూపాయాలు ఖర్చు పెట్టి గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్‌ను సుమారు 40 సెంట్ల విస్తీర్ణ స్థలంలో 1997 సంవత్సరం అప్పటి స్థానిక ఎమ్మెల్యే స్వర్గీయ దేవినేని వెంకరటమణ సహకారంతో శంకుస్థాపన చేశారు. 2001 నాటికి పూర్తి చేసిన గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు , శాసనసభ్యులు జిల్లా, మండల స్థాయి అధికారులు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. కొంతకాలం సజావుగానే బాలికల హాస్టల్ పనిచేసింది. ఆ తర్వాత హాస్టల్‌ను మూసివేశారు. నిరుపయోగంగా, జనసంచారం లేకుండా ఉన్న గిరిజన బాలికల హాస్టల్‌ను గమనించిన కొందరు జులాయి లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకొని సదరు బాలికల హాస్టల్‌లో గంజాయి, మరియు మద్యం సేవించడం, పేకటా తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మల, మూత్రాలను కూడా అక్కడేవిసర్జిస్తున్నారు. అని తెలిసి సదరు బాలికల హాస్టల్‌ను సందర్శించిన స్థానిక ప్రజలకు చూడటానికే రోత కలిగే విధంగా దయనీయ స్థితిలో నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన కంచికచర్ల ఇందిరా కాలనీలోని గిరిజన బాలికల సంక్షేమ హాస్టల్‌ను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సందర్శించి నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోకుండా ముందుగానే ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగే స్థావరాలను గమనించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



# ప్రజాసమస్యలు పరిష్కరించటమే గ్రీవెన్స్ లక్ష్యం : ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్17(ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి శుక్రవారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించే ప్రజాదర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజల సమస్యలను పరిష్కరించటమే అని



శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని, ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి అర్జీ దారులకు తగు న్యాయం చేస్తామని బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, వసంతం అశోక వర్ధన, మల్లవరపు విజయ్, శాఖమూరి చిన్న, వేమూరి శేషగిరిరావు, ముళ్ళపూడి వెంకట్, పణిదపు దుర్గా తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ:**

మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూ!

తెనాలి నియోజకవర్గంలోని తెనాలి పట్టణానికి చెందిన వి.లక్ష్మీ నారాయణ, జె.మస్తానయ్యలకు వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) నుంచి రూ. 4,47,531/ మంజూరైంది. ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి శుక్రవారం, వారికి 4,47,531/ ల చెక్కును ఎంఎల్సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి, బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పార్కులను అందుబాటులో ఉంచండి : సిబ్బందికి మున్సిపల్ కమీషనర్ ఆదేశం

**తెనాలి మున్సిపాలిటీ, ఏప్రిల్17,(ప్రభాతవార్త):** పురపాలకసంఘం పరిధిలోని పార్కు లను పరిశుభ్రంగా ఉంచి, మరమ్మత్తులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని చినరావూరు లోఉన్న సత్యనారాయణ లేక్ వ్యూ పార్కును సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్ల మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే చేయించాలని వాటితో పాటు ప్రజలు వినియోగించే వ్యాయామశాలలో (ఓపెన్ జిమ్)మరమ్మతులు చేయించాలని సిబ్బంది సూచించారు. వాటితో పాటు పార్కు ప్రాంగణంలో ఉన్న బోటు షికారు చేసే చెరువులో ఉన్న ఆకులు, కవర్లు, కాగితములు వంటి వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. 11వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ పనులను పరిశీలించి ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ సాగరయ్యకు కాలువలలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని మురికిపారుదలకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెత్త సేకరణ, చెత్త తరలింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇండ్ల నుండి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని, తడి చెత్తను కంపోస్ట్ యాడ్ కు పంపించే విషయంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు సానిటరీ సెక్రటరీలు నగర దీపికలు ప్రత్యేక



శ్రద్ధ వహించాలని తెలిపారు. కాలువలు శుభ్రం చేసేందుకు వీలు లేకుండా కాలువలపై ఉన్న ,రోడ్డు మార్జిలో ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్లానింగ్ సెక్రటరీ, చైన్ మెన్ లను ఆదేశించారు. రామలింగేశ్వరపేట నుండి చినరావూరు రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్లో, ఆయా ప్రాంతాల్లో నిర్మించవలసిన కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులకు అంచనాలు వెంటనే తయారు చేసి అందించాలని ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు. కమీషనర్ వెంట ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఆంజనేయరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్రైడేని డ్రైడేగా పాటించండి

## వైద్యాధికారి డాక్టర్ హనోక్ బాబు

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్17(ప్రభాతవార్త):** ఫ్రైడే ని డ్రై డే గా పాటిస్తూ, ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇద్దామని, పట్టణంలోని పినపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్యాధికారి డాక్టర్ పేరుపోగు హనోక్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం పినపాడు పరిధిలో మలేరియా సిబ్బంది ఆరోగ్య సిబ్బంది కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది స్థానిక ప్రజలతో కలిసి నీటి నిల్వ లేకుండా చూడండి దోమల అభివృద్ధిని అరికట్టండి, చిన్న దోమ పెద్ద ప్రమాదం, దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులు, వేపాకు పొగ దోమలకు సెగ అనే నినాదములతో అవగాహన




ర్యాలి నిర్వహించారు. పినపాడు వైద్యాధికారి డాక్టర్ పేరుపోగు హనోక్ బాబు మాట్లాడుతూ, చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదం నుంచి కాపాడతాయని ఇంటి లోపల ఇంటి బయట నీటి. నిల్వలు లేకుండా చేసుకొనుట వలన దోమలు గుడ్లు పెట్టడానికి అవకాశం ఉండదని, తద్వారా దోమల ద్వారా వ్యాపించి వ్యాధుల సంఖ్య తగ్గుటకు అవకాశం కలుగుతుందని అన్నారు .ఇది ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా దోమలు నీటిలో గుడ్లు పెట్టిన తర్వాత ఎనిమిది నుంచి పది రోజులలో పెద్ద దోమలుగా మారతాయని కనుక పెద్ద దోమలు గా మారక ముందే నీటి నిల్వలను కనీసం వారానికి ఒక్కసారైనా తొలగించుకొనుట ద్వారా దోమలు గుడ్లు పెట్టుటకు అవకాశము లేక దోమల పుట్టుకనే ఆపుటకు అవకాశం కలుగుతుందని చెప్పారు. , ప్రజల అవగాహనతోనే ఇది సాధ్యమని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే గా పాటించాలని కోరారు.

అనంతరము ఇన్చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ, నీటిని పరిశీలించుట, నీటిని శుభ్రపరచుకొనుట ,మూతలు పెట్టుకొనుట అనే మూడు విధానాల ద్వారా దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చునని తెలిపారు. ప్రతి శుక్రవారం నీటి నిల్వలను తొలగించుకొనుట ద్వారా సమాజంలో దోమల ఉత్పత్తి తగ్గిపోతుందని ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడుకొనవచ్చునని తెలిపారు. ముఖ్యంగా దోమతెరలు వాడుకొనవలెనని ,పూర్తి వస్త్రధారణ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి, మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ దర్శి లలిత, గురవమ్మ, సుధీర్, డీఈవో టి. గోపాలకృష్ణ, విజయకుమార్, ఏఎన్ఎంలు నిర్మల, శ్రీదేవి ,సుశాంతి, రాణి, గీతావాణి, రషీద్, ఆశా కార్యకర్తలు హేమలత, మాధవి, సుధారాణి, శ్యామల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# పురపాలకసంఘం వారి సెప్టిక్ ట్యాంక్ లను వినియోగించుకోండి : మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ, ఏప్రిల్17,(ప్రభాతవార్త):** పురపాలక సంఘం అందిస్తున్న సెప్టిక్ ట్యాంక్ సేవలను సద్వినియోగ పరచు కోవాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సూచించారు. జిల్లా కలెక్టర్ అనుమతితో పురపాలక సంఘ సెప్టిక్ ట్యాంక్ ను పట్టణంలోని హోటల్స్ కళాశాలలో అపార్ట్మెంట్లు, హాస్టల్స్ సినిమా థియేటర్ వంటి వాటిలో సెప్టిక్ ట్యాంకులను తోడించుకునేందుకు పురపాలక సంఘం ద్వారా సెప్టిక్ ట్యాంక్ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ట్యాంకుకు 500 రూపాయలు



చెల్లించాలని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం చెంచుపేటలోని రావి టవర్స్ లోని సెప్టిక్ ట్యాంకును పురపాలక సంఘ సెప్టిక్ ట్యాంకు ద్వారా తోడించడం జరిగినది. సెప్టిక్ ట్యాంకులు తోడే బయట వ్యాపారులకు కూడా గెజిట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సెప్టిక్ ట్యాంక్ వాహనాలు నిర్వహిస్తూ ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకుని వారు వేయి రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తోడిన సెప్టిక్ ట్యాంకులను కచ్చితంగా పూలే కాలనీలో గల ఎస్ టి పి ప్లాంట్ లో మాత్రమే అన్లోడ్ చేయాలని ఆ విధంగా చేయని వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని సూచించారు. పురపాలక సంఘం సెప్టిక్ ట్యాంకు అవసరమైన వారు పని దినాలలో టోల్ ఫ్రీ నెంబర్ 18004256468 కు ఫోన్ చేసి బుక్ చేసుకోవచ్చని. తెలిపారు. పట్టణంలోని హాస్పిటల్స్ సినిమా థియేటర్లు అపార్ట్మెంట్లు, హోటల్స్, హాస్టల్స్, భవనాల వారు తప్పనిసరిగా ఏడాదికొకసారి సెప్టిక్ ట్యాంకులను తోడించుకోవాలని సూచించారు. కమీషనర్ వెంట ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, ఇన్చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ధారా రాజేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంబంధిత పత్రాలతో క్షౌరశాలలకు ఉచిత విద్యుత్తు

**తెనాలి టౌన్ ఏప్రిల్17(ప్రభాతవార్త):** రాష్ట్ర నాయి బ్రాహ్మణుల క్షవరశాలలకు 200 యూనిట్లు లోపు ఉన్నవారికివరకు ఉచిత కరెంట్ ఇస్తున్నారని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ కురగంటి రఘురామయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల 200 యూనిట్లు లోపల ఉన్న క్షవరశాలలకు విద్యుత్ బిల్లులను మాఫీ చేసిన మాట వాస్తవం. అయితే ఇటీవల బార్బర్ షాప్ నిర్వహిస్తున్న నిర్వాహకులు వారు ఆదాయపు సర్టిఫికెట్, షాపు ఓనర్ల ధ్రువీకరణ పత్రం, మీ ఆధార్ రేషన్ కార్డును సబ్మిట్ చేయవలసిన దిగా కోరి యున్నారు. అయితే ఆదాయపు సర్టిఫికెట్ పట్టణాల్లో సంవత్సర ఆదాయం 70 వేలు గ్రామీణ ప్రాంతాల్లో 60 వేలు ఉండాలని జి ఓ ఇష్యూ చేశారు. ఇప్పుడు వాటిని సవరిస్తూ బిపిఎల్ సర్టిఫికెట్ తాసిల్దార్ నుండి పట్టణాలు సంవత్సర ఆదాయం 1,44,000 , గ్రామీణ ప్రాంతాల్లో



1,20,000 సర్టిఫికెట్ తీసుకొని రావలసినదిగా, ఏపిసిపిడిసిఎల్ తెనాలి డివిజన్ ఈఈ అక్కల సత్యనారాయణ తెలియజేశారు. కావున అర్హత కలిగిన నాయిబ్రాహ్మణ సోదరులు, తమ ఆదాయం సర్టిఫికెట్, మిగిలిన సర్టిఫికెట్లు తీసుకొని విద్యుత్ శాఖ అధికారులకు అందజేయాల్సిందిగా రఘురామయ్య తెలియజేశారు. మీరు సర్టిఫికెట్లను అందజేసిన వెంటనే ఆ తర్వాత నెల నుంచి మీ షాపులు 200 యూనిట్లు కంటే తక్కువ ఉంటే మీ బిల్లు తీసేస్తారు. ఇది గమనించవలసిందిగా రఘురామయ్య ప్రకటనలో తెలియజేశారు. ఈ పథకం కేవలం నాయి బ్రాహ్మణుల క్షవరశాలలకు మాత్రమే ఇది వర్తిస్తుందని, విద్యుత్ ఈఈ సత్యనారాయణ తెలియజేసి నట్లు రఘురామయ్య వివరించారు.

# సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**తెనాలి టౌన్ ఏప్రిల్17(ప్రభాతవార్త):** కంటిశుక్లాలు, కంటికిసంబందించిన వ్యాదులపట్లజాగ్రత్తగాఉండాలని డాక్టర్ అగర్వాల్స్ ఐ హస్పటల్ వైద్యులు సూచించారు. శుక్రవారం కవిరాజపార్కు సీనియర్ సిటిజన్ హాల్ నందు బారతసంస్కృతికసహకార స్నేహసంఘం(ఇస్కఫ్), సాయిమంగా వెల్ఫేర్ సొసైటీఅద్వర్యంలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని




ఇస్కఫ్ జాతీయనాయకులు బొల్లిముంతకృష్ణ, సాయిమంగావెల్ఫేర్ సొసైటీ ఆద్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ లు ప్రారంబించారు. ఉచిత రక్తపరీక్షలు అమ్ పాత్ ల్యాబ్ సహకారంతోనిర్వహించారు. శిబిరంలో వందమందికి రోగులకుపరీక్షలునిర్వహించి, కంటిచికిత్స అవసరమైన వారికి అపరేషన్ లు అరోగ్యశ్రీ ద్వారా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలోఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి చల్లగాని శ్రీదేవి, ప్రొఫెసర్ లాలితనందప్రసాద్, జర్నలిస్ట్ నాయకులు ఓ.మార్కండేయులు, నియోజకవర్గంఏఐటియుసి ప్రదానకార్రదర్శి తుంగా బాలస్వామి, అరసంనాయకులు కనపర్తి బెనహర్, నీలాంబ్రం, రామయ్య, పసుపులేటి సునీత, వెంకటరామయ్య, డాక్టర్ అగర్వాల్స్ ఐహస్పటల్ సిబ్బందికె.కుసుమ, యస్.కె.నాగుర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.



# వేసవి చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్17(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం శివాజీ చౌక్ సెంటర్ లోని జామియా మసీద్ వద్ద, శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ నసీం అతని మిత్రబృందం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఎంఎల్సి ఆలపాటి మాట్లాడుతూ, వేసవికాలంలో బాటసారులకు, వివిధ రకాల పనులు చేసుకునే ప్రజల దాహార్తి తీర్చాటానికి నసీం అతని మిత్రబృందం చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందించదగ్గ విషయమని, ప్రజాసేవకు కూటమిప్రభుత్వంతో పాటు నాయకులు కార్యకర్తలు కూడా ముందుంటారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి ఆలపాటి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్

## ఎమ్మెల్యే రామాంజనేయులు

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ..ప్రజా సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను పారదర్శకంగా స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు తీసుకునే విధంగా చేపట్టడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా పరిగణించి నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు అధికారులు కట్టుబడి పనిచేస్తున్నారని చెప్పారు. సమస్య పరిష్కారంలో ఆలస్యం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు




పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు గృహ, పెన్షన్, వైద్యం, డ్రైనేజ్, సిసి రోడ్ల నిర్మాణం పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలియజేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి తమ నైపుణ్యాలను రీసెర్చ్ దిశగా అభివృద్ధి చేసుకోవాలి

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** విద్యార్థి తమ నైపుణ్యాలను గుర్తించి వాటిని రీసెర్చ్ దిశగా అభివృద్ధి చేసుకోవాలని కీనోట్ స్పీకర్ శేషాద్రి రావు పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలోనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం మరియు విజయవాడ ఐఈటీఈ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్సీ కిట్స్ 2కె26 - నాలెడ్జ్ బేస్డ్ ఇన్వెంటివ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ సిస్టమ్స్ అనే ఆరవ జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల సాంకేతిక జ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ అవసరాలకు అనుసంధానించే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇన్నోవేషన్ మరియు రీసెర్చ్ రంగాలలో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం తమ కళాశాలలో రెండు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు మరియు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ పరిశోధనాత్మక ఆలోచనలు, సాంకేతిక జ్ఞానం మరియు అనుభవాలను పరస్పరం పంచుకున్నారని వెల్లడించారు. ముఖ్య అతిథి మరియు కీనోట్ స్పీకర్ శేషాద్రి రావు హాజరై మాట్లాడుతూ.. ఈసీఈ విభాగంలోని వివిధ ఉపవిభాగాలపై అవగాహన పెంపొందించుకుంటూ, నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని ప్రేరణనిచ్చారు. విద్యార్థి దశలోనే రీసెర్చ్ పేపర్ రచించడం గొప్ప సాధనగా అభివర్ణిస్తూ, ప్రతి విద్యార్థి తమ జీవిత లక్ష్యాన్ని స్వామి వివేకానంద స్ఫూర్తితో నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరంలోని లక్కిరెడ్డి బాల్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పూర్ణయ్య బిళ్ల విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను ఇన్నోవేషన్ దిశగా మలుచుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత కాలంలో ఇండస్ట్రీ మరియు మాన్యుఫాక్చరింగ్ రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నందున వాటిపై అవగాహన పెంపొందించుకుంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం



అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాంటి జాతీయ సదస్సులను నిర్వహించడం విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కన్వీనర్ డాక్టర్ పూర్ణ కిషోర్ సదస్సు వివరాలను తెలియజేస్తూ ఈ కాన్ఫరెన్స్ కు మొత్తం161 పరిశోధనా పత్రాలు అందగా, వాటిలో నాణ్యత పరంగా ఉత్తమమైన 91 పత్రాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత పదునుపెట్టి పరిశోధన రంగంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఆదినారాయణ, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.శరత్ కుమార్, కోకోఆర్డినేటర్ ప్రకాష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీల్లో అరవింద విద్యార్థుల ప్రతిభ

**మంగళగిరి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** అరవింద స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. టచ్ రగ్బి నేషనల్ ఛాంపియన్షిప్ 2025-26 పోటీలు శ్రీనగర్(




జమ్మూ అండ్ కాశ్మీర్ )లో వైభవంగా నిర్వహించబడ్డాయి. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఆర్. రిత్విక్, జి. నందకిషోర్, ఎం. అతోష్, ఓ. వెంకట శ్రీరామ్, ఓ. యోగేశ్వర్, ఎం. ఆనంద్, జి. తరుణ్, ఎం. సాయి వెంకట్ వంటి ప్రతిభావంతులైన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. వీరు సీనియర్, జూనియర్, సబ్జూనియర్ కేటగిరీలలో అద్భుతమైన ఆటతీరు కనబరచి, కఠిన పోటీని ఎదుర్కొని గౌరవనీయమైన 4వ స్థానాన్ని సాధించారు. ఈ జట్టు ఏపీ రగ్బీ స్టేట్ సెక్రటరీలు దత్తారావు, బి.రామాంజనేయులు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఈ విజయానికి పాఠశాల యాజమాన్యం అందించిన సహకారం ఎంతో ముఖ్యమైనది. కరస్పాండెంట్ ఇంద్రాణి , ప్రిన్సిపల్ అరవింద్, ఇన్చార్జ్ సత్య శేఖర్ విద్యార్థులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, సరైన మార్గనిర్దేశం చేశారు. స్పోర్ట్స్ టీచర్లు సురేష్ కుమార్ , సుజాత కఠిన శిక్షణ అందించి, వారి ప్రతిభను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు కేవలం గెలుపు మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సమన్వయం, నాయకత్వ లక్షణాలు వంటి జీవిత నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంటారు. ఈ అనుభవం వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు.

# శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**మంగళగిరి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నదాన మహోత్సవం భక్తులతో కిటకిటలాడింది. శుక్రవారం మంగళగిరి శివాలయం సమీపంలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మెట్ల మార్గం వద్ద జరిగిన ఈ సేవా కార్యక్రమం భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. ప్రతినెల అమావాస్య రోజున నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతూ విశేష ఆదరణ పొందుతోంది. ప్రతి సారి సుమారు నాలుగు వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. కార్యక్రమ స్థలానికి ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి, క్రమపద్ధతిలో అన్నప్రసాదం స్వీకరించారు... ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, అన్నప్రసాదం పంపిణీలో పాల్గొని భక్తులకు సేవలందించారు. ఆయనతో పాటు ట్రస్ట్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ, పరమశివుని కృపతో పాటు భక్తులు, దాతల సహకారంతో ఈ అన్నదాన యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుండటం సంతోషకరమని తెలిపారు. ప్రతి అమావాస్యకు 4000 వేలా మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించడం మాకు ఆధ్యాత్మిక తృప్తిని ఇస్తోందన్నారు. ఈ సేవా కార్యక్రమం వెనుక సుమారు 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదార సహాయంతోనే ఇంత పెద్ద స్థాయిలో అన్నదానం నిర్వహించడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. తీవ్ర వేసవి వేడిలో దాహంతో అలమటిస్తున్న వాహనదారులు, పాదాచారులకు ఉపశమనం కలిగించేందుకు



చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు పందేటి సాంబశివరావు తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ఆయన ఆధ్వర్యంలో సగర సంక్షేమం కార్యాలయం వద్ద, గౌతమ్ బుద్ధ రోడ్డువెంబడి మజ్జిగ, చల్లని మంచినీటి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించాలనే సంకల్పంతో ఉన్నామని తెలిపారు. ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కలవకొల్లు వెంకయ్య, గండికోట శ్రీనివాసరావు, కర్నాటి శివ సత్యనారాయణ, నంగళం ప్రసాద్, కగ్గా శ్రీను, దుంపల సోములు, కటారి విష్ణుమూర్తి, కోదాటి శ్రీనివాసరావు, వాసు గోల్డ్, గండికోట అచ్చయ్య, పేరు బోయిన వెంకటేశ్వరరావు, శ్రీహరి, చిరుమామిళ్ల రంగారావు, పంచల శివన్నారాయణ, రెడ్డి వీర రాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ, ముద్రబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్‌యులో ఏఐ పై జాతీయస్థాయి సదస్సు

**తాడేపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ) నెక్స్ట్ జనరేషన్ కంప్యూటింగ్ కు పెరుగుతున్న ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ కెఎల్‌యు లో రెండు రోజులపాటు జాతీయస్థాయి సదస్సు ను నిర్వహించారు. వర్సిటీలో బిసిఏ విభాగం ఆధ్వర్యంలో కాన్ఫ్లుయేన్స్ 2026 అనే పేరుతో నిర్వహించిన ఈ సదస్సు కు విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు ఒకచోట చేరి, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ మరియు ఆధునిక కంప్యూటింగ్ టెక్నాలజీల పరిధి గురించి విస్తృత స్థాయిలో చర్చలు జరిపినట్లు బిసిఏం విభాగాధిపతి డాక్టర్ కె.భగవాన్ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ డి.ఎం.కిషోర్‌బాబు, బిసిఏ విభాగాధిపతి డాక్టర్ కె.భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



# తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంల వద్ద మంచినీటి చలివేంద్రం ఏర్పాటు

**తాడేపల్లి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ పనులపై కేంద్ర కార్యాలయానికి విచ్చేసిన వారికి ఊరటనిస్తూ మంచి నీరు, మజ్జిగ ఏర్పాటు... మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేమారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్ ఇంటి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్ర కార్యాలయం మీడియా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ లు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిలా రఘురామ్, ఎండి రుహుల్లా చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు మీడియాతో మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని మంగళగిరి ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో జరగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేక అంజిరెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, పంచాయతీ రాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి ఫిరోజ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నవయుగ వైతాళికుడు, చిరస్మరణీయుడు కందుకూరి వీరేశలింగం

**గుంటూరు కల్చరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కందుకూరి వీరేశలింగం సమాజంలో దురాచారాలను, మూఢ నమ్మకాలను పొగొట్టడానికి తన కలాన్ని కత్తిగా ఝళిపించిన గద్య తిక్కన అని ఆయన తన సాహిత్యాన్ని సమాజాభివృద్ధికి వినియోగించన ప్రతిభాశాలి అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు పండితులు రాజన్న మాస్టారు మాట్లాడుతూ మన భారతీయ చరిత్ర పుటల్లో చిరస్థానం పొందిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం, మహిళలకు విద్య అవసరమని, వితంతువులకు పునర్వివాహాలు ఆవశ్యకమని ప్రచారం చేసి మూఢాచారాలు, మూఢ నమ్మకాలను సంఘంలో దురాచారాలను రూపుమాపడానికి కందుకూరి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. 1971డిసెంబర్ 11న తొలి వితంతు పునర్వివాహాన్ని జరిపించారని, తర్వాత ఎన్ని అడ్డంకులు ఎదురైనా 40వితంతు పునర్వివాహాలు జరిపించాడన్నారు.

# ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటా..

**ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
**ప్రజాదర్బార్ లో 164 అర్జీలు స్వీకరణ**
**నా కార్యాలయానికి ఎప్పుడైనా రావచ్చు**
**త్వరలో ఈస్ట్ నియోజకవర్గ ప్రజల కోసం టోల్ ఫ్రీ**
**ప్రజాదర్బార్ తో ప్రజలకు మరింత చేరువయ్యాం**
**గత ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్ కార్డుల్లో కోత.**

గుంటూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని, ఇది తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అయ్యా రేషన్ కార్డు ఇచ్చారు.. అందులో పేర్లు తప్పులుగా వచ్చాయి. సరి చేయించండి అంటూ ఒకరు.. పింఛన్ కోసం ఎన్నో రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పింఛన్ ఇప్పించండయ్యా అంటూ మరొకరు.. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదు అంటూ ఇంకొకరు ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై మొత్తం 164 అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారని వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం 18 నెలల కాలంలోనే



మెగా జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం

### ఎంపిడిఓ అత్తోట దీప్తి

**తెనాలి టౌన్ ఏప్రిల్17(ప్రభాతవార్త):** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు దోహదం చేస్తాయని తెనాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంఘం జాగర్లమూడి, అంగలకుదురు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేక పాలనాధికారిగా నియమింపబడ్డ, ఎంపీడీవో అత్తోట దీప్తి గ్రామస్తుల, రైతుల నుండి సమస్యలను స్వయంగా తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు తెలిపిన సమస్యల గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు.




## పీడిత ప్రజలకోసం జీవితాన్ని ధారపోసిన అందే శ్యామ్

### ఆయన ఆశయాలను కొనసాగించటమే నిజమైన నివాళి

**తెనాలి టౌన్ ఏప్రిల్17(ప్రభాతవార్త):** నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ లో అటు పోట్లను ఎదుర్కొని, పీడిత ప్రజల కోసం పోరాడిన అందే శ్యామ్ ఆశయాల కొనసాగింపే ఆయనకు నిజమైన నివాళి అని సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ అన్నారు. ఏప్రిల్ 13న మృతి చెందిన శ్యామ్ సంస్మరణ సభ శుక్రవారం ఐతానగర్ హయ్యర్ పేట నివాసంలో కుటుంబ సభ్యులు, వివిధ ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహించాయి. న్యాయవాది కనపర్తి బెన్హర్ అధ్యక్షతన జరిగిన సభలో తొలుత శ్యామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు ప్రసాద్ మాట్లాడుతూ, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం బాధ్యునిగా సుదీర్ఘ కాలం పనిచేసిన శ్యామ్ ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నారని చెప్పారు. కుల నిర్మూలన పోరాట సమితి ఎన్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి కృష్ణ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో శ్యామ్ దళితుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. మంత్రి పాలెంలో ఆక్రమణలకు గురైన దళితుల భూములను విడిపించేంతవరకు అవిశ్రాంతంగా పోరాడారని, భారత్ బచావో ఉద్యమంలోనూ కీలకంగా పని చేశారని, నిజాంపట్నం థామస్ పేట, మిలటరీ కాలనీలలో దళితుల చేపల చెరువులను ఆక్రమించిన అగ్రవర్ణాల తీరుకు వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్ మాట్లాడుతూ,అంబేద్కర్ భావజాలం నర నరాన జీర్ణించుకున్న శ్యామ్, ఐతా నగర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎస్సిఆర్పిఎస్ మార్కాపురం జిల్లా ప్రెసిడెంట్, న్యాయవాది మోతుకూరు శ్రీనివాసులు మాట్లాడుతూ, అందే శ్యామ్ మరణం ఆల్ ఇండియా షెడ్యూల్ కులాలు హక్కుల పరిరక్షణ కమిటీ కి తీరని లోటని అన్నారు. సభ నుద్దేశించి ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్ వలి, కంచర్ల హేరమ్బ్, హైకోర్టు న్యాయవాది గుంటి సురేష్, మునిపల్లి రాజారత్నం, కొక్కిలిగడ్డ స్వామి, పోతురాజు, ఎఐఎస్సిఆర్పిఎస్ నాయకులు రుద్రాక్ష చంగల్ రాయుడు, బీఎస్పీ నాయకులు పోలుమట్ల సాంబశివరావు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో బాలస్వామి, సంజయ్,ఎం. శ్రీనివాస్, కుటుంబ సభ్యులు వర్ధిని, చైతన్య,గౌతమ్,వివిధ ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.




## జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

### పాల్గొన్న జనసేన నేతలు

**వట్టిచెరుకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** జనసేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ నాయకురాలు దార్ల కనకమహాలక్ష్మి, సీనియర్ నాయకులు దార్ల మహేష్ సహకారంతో గుంటూరు జిల్లా కోర్టు వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కనకమహాలక్ష్మి ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి మాట్లాడుతూ గత ఐదు



సంవత్సరాల నుండి మజ్జిగ పంపిణీని ప్రతి వేసవి కాలంలో ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటారని తెలిపారు. పేద, ధనిక, కులం, మతం తేడాలేకుండా ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి ధర్మ చలివేంద్రాలు ఏంతో ఉపయోగపడతాయని వివరించారు. సేవా సదన్ అధ్యక్షుడు మిరియాల గోపి మాట్లాడుతూ..జనసేన పార్టీ ప్రజలకు ఉపయోగకరమైన ఉచిత మజ్జిగ పంపిణి చేయడానికి కృషి చేసిన లాయర్ కనకమహాలక్ష్మి, మహేష్ దంపతులను అభినందించారు. నగర కార్యదర్శి కలగంటి త్రిపురా కుమార్ మాట్లాడుతూ శ్రామికులు, రైతు కూలీలకు మజ్జిగ పంపిణి ఏంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దార్ల మహేష్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఏండలో పనిచేయు శ్రామికులు శారీరకంగా అలసి పోయి సేద తీరడానికి ఈ మజ్జిగ శక్తి నిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో 19వ డివిజన్ జనసేన పార్టీ ఉపాధ్యక్షులు ఉప్పు వెంకట్, కార్యదర్శులు తోట పవన్ కుమార్, గట్టుమళ్ళ బద్రి, వీర మహిళా రామిశెట్టి ధరణినాయుడు, కాపు నాయకులు అమ్మ శ్రీనివాసరావు నాయుడు, దేగల వెంకటేశ్వరరావు, బండి రాంప్రభు, కుర్రా రవి, నాంచారయ్య, వి.మంగారావు, చిరంజీవి ఫ్యాన్స్ సీనియర్ నాయకులు, మంత్రి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 24,25తేదీల్లో కెఎల్‌యులో జాతీయస్థాయి సదస్సు

**తాడేపల్లి,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీలోని ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24,25తేదీల్లో రెండు రోజులపాటు జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తెలిపారు.ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సదస్సులో పాల్గొనేందుకు అన్ని రకాల డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో ఎంసీఏ చివరి సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభను ప్రతిబింబించే విధంగా వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.సదస్సుకు ట్రిపుల్ ఐటి కొట్టాయం నుంచి కొప్పాల గురవయ్య,జెడ్ఎన్‌యు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ ఖ్రుద్దీన్ లు ప్రత్యేక ఆహ్వానితులు గా హాజరు కానున్నారు.ఈ సదస్సు విద్యార్థులకు పరిశోధనలు,ఆవిష్కరణలు,కేరీర్ అభివృద్ధికి మంచి వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కెఎల్ యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు,వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ,ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు,ఎంసిఏ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ జనాభా లెక్కలు బోగస్ : దళిత బహుజన పార్టీ

**గుంటూరు విద్య ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జనాభా లెక్కలు బోగస్ అని అవి పూర్తిగా గా అసత్యమని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి. కృష్ణ స్వరూప్ ఆరోపించారు. మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ లో నియోజకవర్గల పునరవిభజన బిల్లు సందర్భంగా తెలంగాణ లో జనాభా లెక్కలు అంటూ (2011 జనాభ లెక్కలు ల ను రాష్ట్ర ప్రభుత్వం అధికారపూర్వకంగా ప్రకటించడం అత్యంత దారుణం. సిగ్గుచేటన్నారు.ప్రధానంగా ఎస్సి కులాల్లోని మాల. మాదిగ కులాలు కు చెందిన జనాభా లెక్కలు తప్పుడు సమాచారం అన్నారు. 2027 లోనే దేశ వ్యాప్తంగా జనాభ లెక్కులు సేకరణ తరువాత నే నియోజకవర్గ ల పునరవిభజన చేపట్టాలని కేంద్రం లోని మోడీషా సర్కార్ ను డిమాండ్ చేసారు. మహిళ రిజర్వేషన్ బిల్లు లో 33 శాతం రాజకీయ అవకాశాలు కల్పన చట్టం లో ఎస్సి. ఎస్టీ. బిసి మహిళ లకు ప్రత్యేక ఉప కోట కేటాయించిన తరువాత నే మహిళ లకు రిజర్వేషన్ ల చట్టం ను అమలు చేయాలనీ.. లేకపోతే ఎస్సీ ఎస్టీ బీసీ మహిళ మెజారిటీ దళిత బహుజన సమాజానికి తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. మోడీ షా ల తో కుమ్మక్కు ఐన తెలంగాణ లోని రేవంత్ రెడ్డి సర్కార్ ఎస్సి. ఎస్టీ బీసీ జనాభ ను తక్కువుగా చూపించారని ఆరోపించారు. ముఖ్యం గా 23 ఉప కులాల మాల ల జనాభ ను అత్యంత తక్కువుగా చూపారని ఆరోపణలు చేసారు.ఎస్సి జాబితా లోని ఒక కులాన్ని అక్కున చేర్చికోవడం మరొక కులానికి ద్రోహం చేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ ని కాంగ్రెస్ పార్టీ ని బొందపెట్టాలని కృష్ణ స్వరూప్ పిలుపు ఇచ్చారు.రాజ్యాంగం ప్రకారం ప్రతి పదేళ్లకు దేశంలోని జనాభ లెక్కులు సేకరణ జరగలని అన్ని స్థాయిలలో విధాన పరమైన నిర్ణయం తీసికోవడం ప్రస్తుత జనాభ లెక్కలు సేకరణ ద్వారా నే జరగాలిగాని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 2011 జనాభా ఆధారంగా ప్రాతిపదికన తీసికోవడం చట్ట వ్యతిరేకంగా అన్నారు. రేవంత్ రెడ్డి కి దమ్ము ఉంటే 2027 లో దేశ వ్యాప్తంగా జనాభా లెక్కలు. కుల. మత సేకరణ ఎస్సీ ఎస్టీ బీసీ ఉప కులాల జనాభా ను సేకరించాలన్నారు. ఆ తరువాత నే రాష్ట్ర ప్రభుత్వం అన్ని విషయాలలో ముందుకు అడుగు వేయాలని డిమాండ్ చేసారు. లేకపోతే ప్రభుత్వం ను ఉన్నత న్యాయస్థానల్లో దోషి గా నిలబెడతామని కృష్ణ స్వరూప్ ప్రకటించారు.ఈ సమావేశం లో పార్టీ నాయకులు పి. మోహన్ రావు. దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో : ఆర్డినేటర్ ఇటికాల. గణేష్. మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మక్కా. దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

## మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆమోదం పొందాలని కోరుతూ

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళల ప్రత్యేక పూజలు

**గుంటూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆదేశానుసారం, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆమోదం పొందాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ తెలుగు మహిళలు బృందావన గార్డెన్స్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు ఒక చారిత్రాత్మక నిర్ణయం అని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా మహిళలకు రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుందని, వారి స్వరానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఇది మహిళల రాజకీయ హక్కులను పరిరక్షించడమే కాకుండా సమానత్వానికి దారి తీసే కీలక అడుగు అని అభిప్రాయపడ్డారు.మహిళలు అధికారంలో భాగస్వామ్యమైతే ఆరోగ్యం, విద్య, భద్రత, కుటుంబ సంక్షేమం వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. మహిళల పాలనలో పారదర్శకత పెరిగి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా



అమలవుతాయని తెలిపారు. ఈ బిల్లు ద్వారా సమాజంలో సమతుల్యత పెరిగి మహిళా సాధికారత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. 1996లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ఎన్నో ఏళ్ల తర్వాత ఆమోద దశకు చేరుకోవడం ఆనందకరమని పేర్కొంటూ, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలిపారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారతకు పునాది వేసిన నందమూరి తారక రామారావు గారు మహిళలకు ఆస్తి హక్కుల్లో సమానత్వం కల్పించారని గుర్తు చేశారు. అనంతరం నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని, నారా లోకేష్ మహిళా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం, భద్రత, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించాయని పేర్కొన్నారు. స్త్రీ శక్తి, దీపం, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా మహిళలను ప్రోత్సహించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని శివలీల, పంచుమర్తి కల్పన, నంది సరస్వతి, చెంబేటి మణికుమారీ, మానం పద్మ శ్రీ, షేక్ కరిమూన్ , లక్ష్మీ ప్రసన్న, నాగూరా, గుర్రం మల్లీశ్వరి,కడియాల శ్రీదేవి,కోటేశ్వరమ్మ, వకుళా దేవి, బాల కోటమ్మ, శోభా రాణి,రామ లక్ష్మీ, సీత, దర్శనపు విజయమ్మ,శివ జ్యోతి, పేరం అనిత, నాగరాణి, జయలక్ష్మి, నాగ లక్ష్మీ,మీనాక్షి, కామాక్షి,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన వ్యంగ్య హాస్యనాటికలు

గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు,అధ్యక్షులు డి.తిరుమలేశ్వరరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత మరియు సంస్కృతీ సమితి వారి సౌజన్యంతో ఏప్రిల్ 15నుంచి 17వరకు మూడు రోజులపాటు నాటకోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో జరిగిన సభా కార్యక్రమానికి అధ్యక్షులుగా ఆరాధన ఆర్ట్స్ గౌరవాధ్యక్షులు బొల్లేపల్లి శ్రీనివాసరావు వ్యవహరించగా ముఖ్యఅతిథులుగా డాక్టర్ జొన్నలగడ్డ నిహారిక పాల్గొన్నారు.కార్యక్రమాలను ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.తెలుగు నాటక రంగ పురస్కార గ్రహీతలు బండారు



అచ్చమాంబ పురస్కారాన్ని డాక్టర్ ప్రగతికి,కొర్రపాటి గంగాధరరావు పురస్కారాన్ని బి.రమానాయక్ కి,ఆత్మీయ పురస్కారం గాయకులు కొట్టపాటి రామారావులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.సభానంతరం కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఎక్కిరాల కులపతి కృష్ణమాచార్య రచించిన నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన బండారుపల్లి వెంకయ్య మెమోరియల్ ఆర్ట్స్,లింగారావుపాలెం వారి ప్రజాదినం వ్యంగ నాటిక,పృథ్వీ నాటక పరిషత్,హైదరాబాద్ వారి శ్రీశుక రచించిన జి.విజయబాబు దర్శకత్వంలో ఉంగరపు వేళ్ళు నాటికలు చక్కటి సందేశాలతో అభిమానులను అలరించాయి.సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు డి.తిరుమలేశ్వరరావు,నడింపల్లి వెంకటేశ్వరరావు,కళాకారులను అతిథులను ఘనంగా సత్కరించారు.తొలుత కార్యక్రమాలను గొట్టిపాటి రామారావు బృందంచే సినీ మధుర గీతాలతో ప్రారంభించారు.

## ఓర్పుతో సమాచారం సేకరించండి...

## ప్రజలకు జనగణన పై అవగాహన కలిగించండి

### -మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్

కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ఓర్పుతో సమాచారం సేకరిస్తూ ప్రజలకు జనగణనపై అవగాహన కలిగించాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జనాభా గణనపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.శిక్షకుడు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో



కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జనగణన పకడ్బందీగా నిర్వహిస్తూ జనాబా లెక్కల నమోదు ముఖ్యమైన కార్యక్రమంగా తీసుకోవాలన్నారు.ప్రతి వ్యక్తిని ..ప్రతి ఇంటినీ వివరాలు నమోదు చేయాలని చెప్పారు.జనాబా గణన ద్వారా సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ,ఎఎస్‌వో మనోహర్‌రెడ్డి,పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్,డిప్యూటి ఎంపీడీవో దానయ్య,శిక్షకులు ఈదా రామిరెడ్డి,ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జలాల సద్వినియోగంలో అందరూ భాగస్వాములు కావాలి

### మండల ప్రత్యేకాధికారి కొండా వీర వెంకట సత్యనారాయణ

పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త: జలాల సద్వినియోగంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి కొండా వీర వెంకట సత్యనారాయణ కోరారు. నీటి వనరుల సంరక్షణకు ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక డ్రైవ్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అనేక జిల్లాలు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వర్షపాతం అస్థిరత,



భూగర్భ జలాల తక్కువ రీచార్జికారణంగా నీటి మట్టాలు మారుతున్నాయన్నారు. అందువల్ల శాస్త్రీయ పద్ధతుల్లో, ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నీటి వనరులశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్దరణ కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మండలంలోని ఎన్ని చెరువులున్నాయి. ఎన్ని కాలువలున్నాయి. వీటికి సంబంధించిన పూడికతీత, ఆ తర్వాత నీటిని నిల్వ చేయడం వంటి అంశాలను పరిశీలించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. చెరువులు, కాలువలు తదితర నీటి పనులను గుర్తించడం, వాటికి ఆమోదం తెలపడం, 80రోజులపాటు అమలు చేయడం తదితరాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌జిపిఆర్‌ఎస్ నేషనల్ చైర్మన్‌ను కలిసి నాయకులు

**పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన రాజీవ్‌గాంధీ పంచాయితీరాజ్ సంఘటన్‌కు యువ నాయకత్వాన్ని జత చేసి సంస్థను తద్వారా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఏపికి వచ్చిన ఛైర్మన్ డాక్టర్ సునీల్ పన్వార్‌ను పొన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నూరు నియోజకవర్గంలోని పొన్నూరు, పెదకాకాని,




చేబ్రోలు నాయకులు అందె దిలీప్ ఆధ్వర్యంలో కలిశారు. ఆర్‌జిపిఆర్‌ఎస్‌ను బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ఘంటా కిరణ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు, సిటి కాంగ్రెస్ అధ్యక్షుడు కలీల్ అహమ్మద్, పొన్నూరు నియోజకవర్గ నాయకులు కంతేటి యలమంద, గుండారం కార్తీక్, నిడుబ్రోలు మనోజ్ తదితరులున్నారు.

## యూరియా విక్రయాలు యాప్ ద్వారానే చేపట్టాలి

### -వ్యవసాయ సహాయ సంచాలకురాలు రామకోటేశ్వరి

పొన్నూరు, ఏప్రిల్ 17,ప్రభాతవార్త: రాబోయే పంట కాలంలో యూరియా విక్రయాలు యాప్ ద్వారానే చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి ఆదేశించారు. స్థానిక ఎడిఎ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెలలో ఎలాంటి యూరియా విక్రయాలు జరపకూడదన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ఎరువుల కొరత ఉంటుందనే అపోహలో ఉన్నారని చెప్పారు. రైతులు ముందుగా ఎరువులు కొనుగోలు చేయాలనే ఉద్దేశంలో



ఉన్నారని, ఎక్కువ పరిమణాంలో ఎవరూ ఎరువులను కొనుకూడదన్నారు. రాబోయే సీజన్‌కు ప్రతి రైతు వారి యొక్క పాసుపుస్తకం, ఆధార్‌కార్డు ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. ప్రతి డీలర్ వద్ద రైతులకు సంబంధించిన ఆధార్, పొలం విస్తీర్ణం యొక్క వివరాలను రిజిష్టర్ చేసి ఉండాలన్నారు. పొలం లేకుండా ఏ రైతుకు ఎరువులు విక్రయించకూడదని డీలర్లను ఆదేశించారు. దీనివల్ల డీలర్లకు సబ్సిడీ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. యాప్‌లో ప్రభుత్వం వారు రికమండేషన్‌చేసిన ప్రకారం మాత్రమే విక్రయించాలన్నారు. భూమి ఉన్న యజమానికి ఓటిపి ద్వారానే ఎరువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, డీలర్లు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి : జగ్గయ్యపేట వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

**వత్సవాయి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** వత్సవాయి గ్రామంలో జగ్గయ్యపేట వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మరియు జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ స్థానిక రైతులు, నాయకులతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ మొక్కజొన్న పంటలను సరైన ధరకు అమ్ముకునేందుకు కేంద్రాలు ఎంతో అవసరమని, ప్రస్తుతం మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు మధ్యవర్తుల ఆధీనంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్ ఫైజ్ కేంద్రాలను ప్రారంభించి, రైతులకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురాని ఎడల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు యేసుపోగు దేవమణి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కూలికపోగు వెంకటేశ్వర్లు, వత్సవాయి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకర్రావు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు. ఆ క్రమంలో ముందుగా మాజీ మంత్రి దేవినేని నెహ్రూ 9వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## విద్యార్థిని తేజశ్రీ ఆదర్శం

**నిజాంపట్నం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** మండలంలోని కోనఫలం గ్రామానికి చెందిన అడుసుమల్లి నాగతేజశ్రీ ఈ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు కొలసాని రాములు అభినందించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలలో 993/1000 మార్కులు సాధించిందన్నారు. తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి, మండలానికి, నియోజకవర్గానికి ఎంతో గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. తేజశ్రీని శాలువాతో సత్కరించారు. కెడబ్ల్యుడి ఛైర్మన్ పంతాని మురళీధరావు, పుప్పాల నాగేశ్వరరావు, మండలంలోని తెదేపా నాయకులు, కూటమి నాయకులు విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.



# మహిళల భద్రత పై అవగాహన కార్యక్రమం

**తిరువూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** నరసాపురం, విసన్నపేట మండలంఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, నరసాపురంలో మహిళలపై నేరాలపై అవగాహన కార్యక్రమం (క్రైమ్ ఎగైనెస్ట్ వుమెన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్)"ను స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమం ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు రూరల్ డి.సి.పి. లక్ష్మీనారాయణ ఏసిపి పర్యవేక్షణలో మైలవరం ఏసిపి వై. ప్రసాదరావు సూచనలతో తిరువూరు సిఐ. కె.గిరిబాబు మరియు విసన్నపేట ఎస్.ఐ. ఎం.అర్జునరాజు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత కాలంలో మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు పాటించాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, వ్యక్తిగత భద్రత ఎలా కాపాడుకోవాలి వంటి అంశాలను వివరించారు. అలాగే మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై కూడా వివరించారు. బిఎన్ఎస్ సెక్షన్ 63 ప్రకారం అత్యాచారం, సెక్షన్ 75 ప్రకారం లైంగిక వేధింపులు, సెక్షన్ 78 ప్రకారం స్టాకింగ్, సెక్షన్ 77 ప్రకారం వాయూరిజం వంటి నేరాలు మరియు వాటికి సంబంధించిన శిక్షల గురించి తెలియజేశారు. పిల్లల రక్షణకు సంబంధించిన పోస్కో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్లు 112 – అత్యవసర సేవలు1091 – మహిళల హెల్ప్‌లైన్181 – మహిళల సహాయ కేంద్రం1098 – పిల్లల హెల్ప్‌లైన్‌ప్రతి మహిళ తన మొబైల్‌లో "శక్తి యాప్"ను డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైనప్పుడు ఉపయోగించుకోవాలని సూచించారు. అధనంగా స్వీయ రక్షణ పద్ధతులు, సమాజంలో మహిళల భద్రతకు ప్రతి ఒక్కరి బాధ్యతపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల దేవి, గొట్టేటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.




## ప్రాణరక్షణకై అగ్ని ప్రమాద నివారణ

రేపల్లె, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులకు అగ్నిప్రమాదాల పట్ల రేపల్లె అగ్నిమాపక శాఖ అధికారి వై.వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, నివారణ పద్ధతుల గురించి వివరించారు. ఎస్‌పిజి గ్యాస్, విద్యుత్, కేర్‌లెస్ స్మోకింగ్ వలన జరిగే అగ్నిప్రమాదాల గురించి తెలియజేశారు. వాటర్ డెమో ప్రదర్శించారు. రసాయనిక చర్య అయిన అగ్ని నుండి ఉష్ణము, వెలుతురు, పొగ ఉద్భవిస్తాయని వెంకటేశ్వరరావు చెప్పారు. అగ్ని ఏర్పడటానికి ఇంధనం, ఉష్ణము, ప్రాణవాయువు తగుపాళ్ళలో అవసరమవుతుందన్నారు. వీటిలో ఏ ఒక్కటి లేకున్నా అగ్ని ప్రమాదాన్ని నిరోధించవచ్చని తెలిపారు. చిన్న నిప్పు రవ్వ క్షణాలలో అదుపుతప్పి చుట్టూరా వ్యాప్తి చెంది అతి పెద్ద అగ్నిప్రమాదంగా మారుతుందని చెప్పారు. చాలా వేగంతో దట్టమైన చీకట్లు కమ్ముకునే విధంగా చేస్తుందన్నారు. క్షణాలలో ఒక ఇంటి నుండి మరొక ఇంటికి మంటలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఒక ఇంటిలోని ఉష్ణోగ్రత నేలపైన 100 డిగ్రీల సెల్సియస్ ఉంటే ఆ ఇంటి ఉపరితలంపై సమతలంగా 600 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని ఆయన వివరించారు. తీవ్రమైన వేడి గాలి పీల్చడం వలన ఊపిరితిత్తులకు నష్టం వాటిల్లుతుందన్నారు. శరీరంపై దుస్తులను కరిగించి చర్మానికి అతుక్కొనే విధంగా అగ్ని వేడి కారణమవుతుందన్నారు. అగ్నిప్రమాదం సమయంలో కంగారుపడకుండా పరిగెత్తకుండా ప్రశాంతంగా ఆలోచించి ప్రమాదం నుండి తప్పించుకోవాలన్నారు. అగ్ని ప్రమాద సమయంలో విద్యుత్ తీగలను తాకవద్దని, బహుళ అంతస్థులలో నివసించే వారు లిఫ్ట్‌ను వినియోగించరాదని సూచించారు. ప్రాణ రక్షణకై అగ్ని ప్రమాద నివారణ చర్యలు పాటించాలని వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది పి.శ్రీనివాసు, ఎ.అనిరుధ్రుడు, ఎస్.నాగేంద్ర రెడ్డి(ఎల్ఎఫ్), వి.సుబ్బారావు, వి.చంద్రమోహన్(డ్రైవర్), ఎం.జనార్ధన రావు, డి.పవన్‌కళ్యాణ్, డి.రాజేష్ గౌడ్(ఎఫ్ఎం), ఎ.నాగార్జున రావు, కె.వెంకటేష్, ఎన్.వెంకటేశ్వరరావు (హెచ్‌జి) తదితరులు పాల్గొన్నారు.



## విలేకురుల హెల్త్‌స్కీం గడువు పొడిగింపు

**పెనమలూరు/మచిలీపట్నం ఏప్రిల్17,ప్రభాతవార్త :** జర్నలిస్టు హెల్త్‌స్కీం పొడిగింపు జీవో ఎం.ఎస్.నెం.43 విడుదల చేసినట్టు పౌరసంబంధాల అధికారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీంను 2026–27 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని కృష్ణాజిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి యం.వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జీవో యం.యస్ నెం.43ను జారీ చేసిందని ఆయన వివరించారు. జిల్లాలో మీడియా అక్రిడేషన్లు పొందిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ.1250 డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సియఫ్‌యంఎస్.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసిందిగా ఆయన తెలిపారు. అకౌంట్. 8342 00 120 01 03 001 001 డిడివో కోడ్ 2703 0802 003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలాన కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు తమ కుటుంబసభ్యుల ఆధార్‌కార్డులు, ఫోటోలు, మీడియా అక్రిడేషన్ కార్డులు, జేపిజె ఫార్మాట్‌లో సంబంధిత జిరాక్స్ కాపీలను మచిలీపట్నం నగరంలోని కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలోని ఉపసంచాలకులు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయవలసినదిగా డిపిఆర్‌ఓ తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500కాగా ఇందులో జర్నలిస్టు సగం వాటా రూ.1250కాగా, ప్రభుత్వం తన వంతు వాటా రూ.1250 చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీం వర్తిస్తుందన్నారు. జిల్లాలోని అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పౌష్టికాహారం పై అవగాహన

రేపల్లె, ఏ ప్రిల్ 17, ప్రభాతవార్త:పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో విఓఏ, పిఆర్‌పిలకు పౌష్టికాహారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో ఎం.సుచిత్ర మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. బహిరంగ ప్రదేశాలు, దుకాణాలలో లభించే ప్యాకేజ్డ్ ఆహారంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్యాకేజ్ చేసిన ఆహార పదార్థాలలో సహజ సిద్ధమైన పోషకాలు, విటమిన్లు, ఫైబర్ తక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ పదార్థాలలో అధిక మొత్తంలో ఉండే ఉప్పు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులకు దారితీస్తాయని చెప్పారు. ప్యాకేజ్డ్ ఆహారం ఎక్కువ కాలం పాడవకుండా ఉండేందుకు కెమికల్ ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రంగులు, ఫ్లేవర్లను ఉపయోగించడం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ప్రాసెస్ చేసిన ఆహారంలో పీచు పదార్థం లేనందున మలబద్ధకం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. చిప్స్, బిస్కట్లు వంటి ప్యాకేజ్డ్ స్నాక్స్ అధికంగా తినే పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల సమస్య ఏర్పడుతుందన్నారు. ప్యాకేజింగ్ కోసం వినియోగించే ప్లాస్టిక్ కవర్లు, క్యాన్ల వలన హానికరమైన రసాయనాలు ఆహారంలోకి చేరి హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయని సుచిత్ర వివరించారు. ప్యాకేజ్డ్ ఆహారం అలవాటుకు దూరం కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హిమబిందు, గోపి, పూర్ణచంద్రరావు, ఆనంద్, మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.




## పట్టణ అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ సమావేశం

తిరువూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఈ నెల 20న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల గురించి చర్చించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం అన్నదానం భారీ కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ 20వార్డుల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



## ఎండ తీవ్రత పెరుగుతోంది తాగునీటి సమస్య రాకుండా చూచుకోవాలి

### -మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని..గ్రామాల్లో త్రాగునీటి సమస్య రాకుండా చూచుకోవాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత గ్రామాల్లోని చెరువులను పరిశీలించి ప్రభుత్వ అధికారులతో శాఖల వారిగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుండి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటిని ప్రజలకు సరపరా చేయాలని చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే భావన ప్రతి ఒక్క అధికారిలో ఉండాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, డిప్యూటి ఎంపీడీవో దానయ్య, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడలో రాస సిల్వర్ షోరూం ప్రారంభం

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** బెంగుళూరుకు చెందిన ప్రముఖ వెండి ఆభరణాల సంస్థ రాస సిల్వర్ ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో అడుగు పెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడ సుస్థిర స్థానం సాధించే లక్ష్యంతో విజయవాడలో షోరూంను శుక్రవారం ప్రారంభించామని, 925 వన్నె వెండితో కళాకారులు బంగారు ఆభరణాలకు ఏ మాత్రం తగ్గేది లేదంటూ రూపొందించిన అన్ కట్ కుందన్ గ్లాస్ వర్క్, రత్నాలు పొదిగిన ఆభరణాలు, టెంపుల్ ఆభరణాల ప్రేరణతో క్లాసిక్ పోల్కి, జదావ్, నవరత్న శైలిలో నిపుణులైన కళాకారుల చేతిలో అత్యంత నైపుణ్యంగా తీర్చిదిద్దుకుంటాయని సంస్థ సహ వ్యవస్థాపకులు మానస్ బోహ్రా అన్నారు.



## నేడు ప్రముఖ గాయనీ సునీత చే సంగీత విభావరి

**విజయవాడ, ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) :** ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర పర్యాటక, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రముఖ గాయనీ, గాయకులచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. వీరిలో ప్రముఖ గాయనీ సునీత హాజరు కానున్నారని, ప్రజలందరికీ ఉచిత ప్రవేశం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలు పండుగలా నిర్వహిస్తున్నామని, 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మినీ మారథాన్, సైక్లింగ్, యోగా సెషన్స్, సంప్రదాయ క్రీడలు వంటివి కూడా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది 18వ తేదీ మొదలు మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతలకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టీఏసీహెచ్) భాగస్వామ్యంతో విజయవాడ నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్జమాలపై కలెక్టర్ లక్ష్మీశ గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి రెవెన్యూ, పర్యాటకం, పోలీసు, వైద్య ఆరోగ్యం, మునిసిపల్, విద్యుత్, అగ్నిమాపక తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.

## రాయల్ ఆర్కిడ్ హోటల్స్ గ్రూప్‌కు చెందిన రీజెంటా హోటల్స్‌తో వ్యూహాత్మక ఒప్పందం

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** హిల్టన్ భారతదేశంలో తన విస్తరణను వేగవంతం చేస్తూ రాయల్ ఆర్కిడ్ హోటల్స్ గ్రూప్‌కు చెందిన రీజెంటా హోటల్స్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా 125 "హాంప్టన్ బై హిల్టన్" హోటళ్లు ప్రారంభించనున్నారు. గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఏర్పాటుకానున్నాయి. పెరుగుతున్న దేశీయ పర్యాటకం, మధ్యతరగతి విస్తరణ నేపథ్యంలో ఈ ఒప్పందం హిల్టన్ "అప్పర్ మిడ్స్కేల్" విభాగ విస్తరణకు దోహదం చేయనుంది.

## షావోమి నుండి మినీ ఎల్ఈడి టివి

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ అద్భుతమైన వీక్షణ అనుభూతిని అందించే దిశగా దేశీయ మార్కెట్లోకి తమ మొట్టమొదటి మినీ ఎల్ఈడీ టెలివిజన్ లైనప్ ఎస్ మినీ ఎల్ఈడీ టివి సిరీస్‌ను లాంచ్ చేసినట్లు షావోమి ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనుజ్ శర్మ ప్రకటించారు. అత్యంత అధునాతన మినీ ఎల్ఈడీ టెక్నాలజీతో స్కీన్‌పై రంగులను మరింత స్పష్టంగా, అద్భుతమైన కాంట్రాస్ట్, బ్యాలెన్స్‌డ్ బ్రైట్‌నెస్‌తో కళ్లకు కట్టినట్లు చూపుతుంది. గదిలో ఉన్న వెలుతురుకు తగ్గట్లుగా స్క్రీన్ కలర్ టెంపరేచర్ ఆటోమేటిక్‌గా అడ్జస్ట్ అయ్యే ఇంటెలిజెంట్ ట్యూనింగ్ ఇందులో ఉందన్నారు.

## అమెజాన్ భారత మార్కెట్లో కొత్తగా ఏఐ స్టోర్

**విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** అమెజాన్ భారత మార్కెట్లో కొత్తగా ఏఐ స్టోర్ ప్రారంభించింది. వినియోగదారులు ల్యాప్‌టాప్స్, స్మార్ట్‌ఫోన్స్, స్మార్ట్ టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు వంటి ఏఐ ఆధారిత ఎలక్ట్రానిక్స్‌ను సులభంగా గుర్తించి, పోల్చి, కొనుగోలు చేసేందుకు ఈ ప్రత్యేక ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుంది. దేశంలో ఏఐ డివైజ్‌లపై డిమాండ్ పెరుగుతుండగా, ముఖ్యంగా టియర్2, టియర్3 నగరాల నుంచి అధిక శోధనలు వస్తున్న నేపథ్యంలో వినియోగదారులు టెక్నికల్ వివరాలు అర్థం చేసుకోకుండానే సరైన ఉత్పత్తిని ఎంచుకునేలా స్పష్టమైన సమాచారం అందించడం ఈ స్టోర్ లక్ష్యం అన్నారు.

## వేసవి తీవ్రత ఎక్కువుగా ఉంది..

# ప్రజలు జాగత్రగా ఉండాలి

### -మండల వైద్యాధికారి నేహ

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** వేసవిలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి నేహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో వేసవి తీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వైద్యాధికారి నేహ ఆరోగ్య సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలకు ప్రజలు మంచి నీటిని ఎక్కువుగా తీసుకోవాలన్నారు. మసాలా పదార్థాలను.. నిల్వ పదార్థాలను తీసుకోరాదన్నారు. తలతిరగటం..వాంతులు రావటం వంటి సమస్యలు వస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. గర్భిణీలు తప్పనిసరిగా నెలా నెలా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగరాజు, ఎఎన్ఎంలు ,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అత్తోటలో వాహనాలు తనిఖీ

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అత్తోట రోడ్డులో శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసినట్లు ఎస్ఐ ఎన్.వి.ప్రసాద్ తెలిపారు. ఆటోలలో అధికంగా ప్రయాణికులను ఎక్కించుకుని తిరుగుతున్న ఆటోల మీద కేసులు నమోదు చేసామన్నారు. ప్రయాణికులకు అధిక లోడుతో ప్రయాణం చేయవద్దని కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగిందని ఎస్ఐ ఎన్.వి.ప్రసాద్ తెలిపారు.



## ఒప్పో మిడ్ రేంజ్ సెల్ఫీ ఛాంపియన్ ఎఫ్33 సిరీస్ ఆవిష్కరణ

**అమరావతి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** భారతదేశంలో ఒప్పో ఇండియా ఈ రోజు ఒప్పో ఎఫ్33 సీరిస్ ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సిరీస్‌లో లో ఒప్పో ఎఫ్33 ప్రో 5జీ తో పాటు ఒప్పో ఎఫ్33 5జీ ఉన్నాయి. ఒప్పో ఎఫ్33 శ్రేణి కీలకమైన పరిణామాన్ని సూచిస్తుంది. ఇందులో 50ఎంపీ అత్యంత విస్తృతమైన సెల్ఫీ కెమెరా ఐపీ69కే ధృడత్వం , 7000ఎంఏహెచ్ బ్యాటరీ, కలర్‌ఓఎస్ 16, 5జీ++ కనెక్టివిటీ ఉంటుంది. ఈ సందర్భంగా ఒప్పో ఇండియా కమ్యూనికేషన్స్ హెడ్ గోల్డీ పట్నాయక్ మాట్లాడుతూ నిజ జీవితం కోసం రూపొందించిన స్మార్ట్‌ఫోన్‌గా, భారతదేశపు క్షీమన్నికైన విజేతఖిగా ఎఫ్ సిరీస్ పేరు సంపాదించుకుందన్నారు.

## వరగానిలో 2వ రోజు నాటిక పోటీల ప్రదర్శన

**పెదనందిపాడు ఏప్రిల్ 17 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో ఈ నెల 16వ తారీకు నుండి 20 వ తారీకు వరకు ఐదు రోజులపాటు జరుగుతున్న లావు వెంకటేశ్వర్లు కల్లూరు నాగేశ్వరావు కళాపరిషత్ నాటక పోటీలలో భాగంగా శుక్రవారం విజయవాడ సాంస్కృతిక సమితి, విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి నాటిక మొదట ప్రదర్శించారు, గత ఏడాది విజయవాడలో వచ్చిన వరదల నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను నటీనటులు కళ్లకు కట్టినట్టు చూపించారు. వరద నీటిలో చిక్కుకున్న భార్యాభర్తల ఆవేదన, వరద ముంపు నుంచి బయటపడటానికి నాటు పడవల వ్యక్తి భార్యాభర్తలకు పదివేల రూపాయలు ఇవ్వాలని కోరటంతో వారి వద్ద 5,000 రూపాయలు ఉన్నాయని చెప్పడంతో, భార్యను వెళ్ళమని చెబుతాడు, కానీ ప్రమాదవశాత్తు ఆమె నీళ్లలో పడడంతో అది చూసిన భర్త గుండె ఆగి చనిపోతాడు. మానవ సంబంధాల కన్నా డబ్బుకే ప్రాముఖ్యం పెరగటం మంచిది కాదని ఈనాటిక ద్వారా చాటి చెప్పారు. ద్వితీయ నాటికగా మానవతా, ఎడ్లపాడు వారి బావ ఎప్పుడు వచ్చుతీవు నాటకం ప్రదర్శించారు. పెళ్లయిన స్త్రీ కట్టుకున్న భర్త మాట చెవదాటకూడదని, పతియే ప్రత్యక్ష దైవంగా భావించాలని, అన్న సంకుచిత స్వభావమున్న భర్తకు భార్య ఏ విధంగా బుద్ధి చెప్పిందని కథతో ఆద్యంతం హాస్య భరితంగా సాగే ఇతివృత్తమే ఈ నాటిక సారాంశం. ఇంటికి వచ్చిన మనుషులను మొదట అన్నయ్య పిలవమని భర్త చెబుతాడు, కానీ భార్య అతని సోదరుడిని కూడా బావ అనకుండా అన్న అని పిలుస్తుంది. అనంతరం ఇంటికి వచ్చిన వారందరినీ బావ అని పిలవమని చెబుతాడు. ఇంటికి వచ్చిన ఆఫీసర్ ను బావా అని పిలుస్తుంది. దానితో భర్త విడాకులు ఇస్తానని అంటాడు. చివరలో భర్తకు తగిన రీతిలో బుద్ధి చెబుతుంది. దీనిలో ముత్తవరపు సురేష్ బాబు, ముత్తువరపు రామారావు, పోపూరి శివరామకృష్ణ, జరుగుల శంకర్రావు నటించారు. రచన భవానీ ప్రసాద్, దర్శకత్వం జరుగుల రామారావు. తృతీయ నాటికగా వి వి కే క్రియేషన్స్ కాకినాడ వారి కన్నీటికి విలువెంత నాటిక ప్రదర్శించారు. అనంతరం పోపూరి వీరయ్య చౌదరి స్మారక పురస్కారం అవార్డును నాటక రచయిత, దర్శకుడు, నటుడు ఎన్టీఆర్ రంగస్థలం పురస్కార గ్రహీత కె ఎస్ టి సాయి కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోపూరి నాగేశ్వరరావు, అప్పా జోషుల సత్యనారాయణ, మండలి బుద్ధ ప్రసాద్, గుమ్మడి గోపాలకృష్ణ, బుర్ర సాయి మాధవ్, మన్నే శ్రీనివాసరావు, బండారు ప్రసాద్, చెరుకూరి సాంబశివరావు, ముద్దన రాఘవయ్య, బండారు రాంబాబు పాల్గొన్నారు.



## పేదరిక నిర్మూలనే జీరోప్రావర్టీ మిషన్ ప్రధాన లక్ష్యం : రాష్ట్ర ప్రణాళిక విభాగం అధికారులు లోగేష్

**కొల్లిపర,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించటమే జీరోప్రావర్టీ మిషన్ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రణాళిక విభాగం అధికారులు లోగేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నవరంలో ఎంపవర్ ఉమెన్‌టీం జీరో పావర్టీ మిషన్ పైలెట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా లోగేష్ మాట్లాడుతూ సర్వే ద్వారా వెనుకబడిన..ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించే దిశగా చర్యలు తీసుకోవటమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలతో మాట్లాడి వారి జీవన పరిస్థితులను తెలుకోవటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనల్ పత్తిపాటి సురేష్, డిఆర్‌డిఏ ఎపిఎం రమాదేవి, ఎంపవర్ ఉమెన్‌టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వైజాగ్లో సోచ్ రెండవ స్టోరు

**అమరావతి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** భారతదేశపు ప్రముఖ సందర్భోచిత, సాయంకాలపు దుస్తుల బ్రాండ్ అయిన సోచ్, వైజాగ్లో తమ రెండవ స్టోర్ను ప్రారంభించినట్లు వెల్లడించింది. దీంతో ఆంధ్రప్రదేశ్లో సంస్థ స్టోర్‌ల సంఖ్య పదకొండుకు చేరింది. సుందరమైన ప్రకృతి సౌందర్యానికి, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందిన వైజాగ్, సాయంకాలపు, సందర్భోచిత దుస్తుల కోసం ఒక ఆశాజనకమైన మార్కెట్గా అభివృద్ధి చెందుతూనే ఉంది. 1,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కొత్త స్టోర్, ఒక ఉన్నతమైన షాపింగ్ అనుభవాన్ని అందించేలా ఆలోచనాత్మకంగా రూపొందించబడింది. ఈ స్టోర్లో సూట్ సెట్లు, చీరలు, కుర్తాలు, లెహంగాలు, డ్రెస్సులు, కాఫ్తాన్లు, ఫ్యూజన్ వేర్ల విస్తృత శ్రేణి అందుబాటులో అనేక రకాల సందర్భాలకు, వ్యక్తిగత శైలులకు అనుగుణంగా ఉందన్నారు.

